సాక్షి
నాగర్‌కర్నూల్
బుధవారం। 12। మార్చి। 2025



బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కందూరు రామలింగేశ్వరస్వామి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి.

వివరాలు 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-33 (బుధవారం సాయంత్రం)

సహర్ 5-06 (గురువారం తెల్లవారుజామున)

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 37.2 /17.2

ఉదయం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

అడ్రస్ లేని అండర్ గ్రౌండ్

భూగర్భ డ్రెయినేజీలకు నోచుకోని మున్సిపాలిటీలు

- జిల్లాకేంద్రం మినహా మిగతా విలీన గ్రామాల్లో అధ్వానం
- రోడ్లపైనే పారుతున్న మురుగుతో తప్పని అవస్థలు
- దోమలు, పందుల స్వైరవిహారంతో రోగాల వ్యాప్తి
- వర్షాకాలంలో తీవ్రమైన సమస్యలు

పేరుకేమో పట్టణాలు– మున్సిపాలిటీలు.. పెద్ద పెద్ద భవంతులు.. విశాలమైన రోడ్లు.. పైకి మాత్రమే కనిపించే సోపుటాపులు ఇవి. కానీ, కొద్దిగా గల్లీల్లోకి వెళ్లి చూస్తే తెలుస్తుంది అసలు బాగోతం.. అచ్చం పల్లెటూర్ల మాదిరిగానే రోడ్లపైనే పారుతున్న మురుగు.. వాటిలో పందుల స్వైరవిహారం, దోమల విజృంభణ షరామామూలుగానే కనిపిస్తాయి. జిల్లా కేంద్రం మినహా.. జిల్లాలోని మిగతా మూడు మున్సిపాలిటీలైన కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తిలో ఇదే దుస్థితి ఎదురవుతుంది. ఎక్కడా భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో పారిశుద్ధ్యం లోపించి ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. జిల్లాకేంద్రమైన నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. జిల్లాలోని మున్సిపాలిటీల్లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో సమస్యలకు దారితీస్తోంది.



కొల్లాపూర్‌లోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆధునికీకరణకు నోచుకోని మురుగు కాల్వల

విలీన గ్రామాలపై చిన్నచూపు

నాగర్‌కర్నూల్: నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితి అధ్వానంగా మారింది. నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలో ఎండబెట్ల, ఉయ్యాలవాడ, దేశిఇటిక్యాల, నాగనూల్ గ్రామాలను విలీనం చేశారు. అయితే ఆయా గ్రామాలపై అధికారులు చిన్నచూపు చూస్తున్నారు. ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రం అయిన తర్వాత పక్కా ప్రణాళికతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం చేయడంతో మురుగు ప్రవాహం నిలిచిపోయింది. అయితే విలీనమైన వార్డుల్లో ఎలాంటి పనులు చేపట్టకపోవడం, ఆయా వార్డులను మున్సిపల్ సిబ్బంది పట్టించుకోపోవడంతో పారిశుద్ధ్యం లోపించింది. కనీసం ఓపెన్ డ్రెయినేజీలను శుభ్రం చేయకపోవడంతో రోడ్లపై మురుగు పారుతూ.. కాలనీలు కంపు కొడుతున్నాయి. దీంతో వార్డుల్లో ప్రజలు దోమలతో సహవాసం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మరికొన్ని చోట్ల ఓపెన్ డ్రెయినేజీలు ధ్వంసం కావడంతో మురుగు ప్రవాహానికి ఆటంకం కలుగుతోంది. పట్టణంతో సమానంగా ఇంటి పన్నులు కడుతున్న తమకు కూడా అన్ని సౌకర్యాలు కల్పించాలని విలీన గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



ఎండబెట్లతో ధ్వంసమైన మురుగుకాల్వ

శుభ్రం చేయడం లేదు..



ఎండబెట్ల వార్డులో చాలాచోట్ల మురుగు కాల్వలు శుభ్రం చేయకపోవడం, కాల్వలు దెబ్బతినడంతో మురుగు నీరు రోడ్లపైనే పారుతోంది. జిల్లా కేంద్రంలో నిర్మించినట్లు ఇక్కడ కూడా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలి.

– శ్రీనాథ్‌గౌడ్, ఎండబెట్ల

ప్రతిపాదనలు లేవు

విలీన గ్రామాల్లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి సంబంధించి ఎలాంటి ప్రతిపాదనలు లేవు. జిల్లాకేంద్రంలో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు దాదాపుగా పూర్తి కావొచ్చాయి.

– శివ, మున్సిపల్ ఏఈ, నాగర్‌కర్నూల్

చిన్నపాటి వర్షాలకే జలమయం

అచ్చంపేట రూరల్: అచ్చంపేట పట్టణం దినదినాభివృద్ధి చెందుతోంది. అయితే మేజర్ గ్రామ పంచాయతీ, నగర పంచాయతీ, మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ ఆ స్థాయిలో ప్రజలకు సౌకర్యాలు కల్పించడం లేదు. ఇప్పటి వరకు అండర్ డ్రెయినేజీ వ్యవస్థనే లేదు. పాలకులు మారినా.. ప్రభుత్వాలు మారినా అభివృద్ధి వైపు అడుగులే పడటం లేదు. పట్టణంలో 20 వార్డులు ఉండగా పారిశుద్ధ్య పనులు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి. చాలా కాలనీల్లో మురుగు కాల్వలు శిథిలావస్థకు చేరడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నూతనంగా నిర్మించినప్పటికీ సక్రమంగా నిర్వహణ లేక, సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో దోమల బెడద తీవ్రంగా ఉంది. దోమల నివారణకు మున్సిపాలిటీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో చిన్నపాటి వర్షాలకే పాతబజార్, బస్టాండు ప్రాంతంలోని ప్రధాన రహదారి, ఉప్పునుంతల రోడ్డులో మురుగు రోడ్డుపైకి వస్తుంది. పాతబజార్‌లో దుకాణాల్లోకి వర్షపు నీరు చేరుతుంది. దీంతో ఇటీవల బస్టాండు ప్రాంతంలో, ఉప్పునుంతల రోడ్డులో కల్వర్టు నిర్మాణాలకు ఆర్అండ్‌బీ నుంచి రూ.1.20 కోట్లు మంజూరు కాగా.. పనుల్లో పురోగతి లేదు.



16వ వార్డులో కాల్వలో పేరుకుపోయిన చెత్తాచెదారం

మురుగు తీయడం లేదు..

చాలా రోజుల నుంచి 16వ వార్డులో మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు. కాల్వలు కొబ్బరిబొండాలు, ప్లాస్టిక్ డబ్బాలతో నిండిపోయి దుర్వాసన వస్తుంది. దోమలబెడద తీవ్రంగా ఉంది. రోగాలు వస్తున్నాయి. వెంటనే కాల్వలు శుభ్రం చేయాలి.

– శారద, 16వ వార్డు, అచ్చంపేట

కొల్లాపూర్‌లో అస్తవ్యస్తం



కొల్లాపూర్‌లో పెంట్లవెల్లికి వెళ్లే రోడ్డు పక్కన పారుతున్న మురుగు

కొల్లాపూర్: మున్సిపాలిటీలో మురుగు వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. పట్టణంలోని చాలా కాలనీల్లో సైడ్ డ్రెయిన్లు లేక **మురుగు రోడ్లపైనే పారుతోంది. 16వ వార్డు**లో అన్నపూర్ణ లాడ్జి **నుంచి వరిదేల చెరువు వరకు ప్రధాన మురు**గు కాల్వ ఉండగా.. కేఎల్ఐ గెస్ట్‌హౌజ్, ఎంపీడీఓ, ఆర్డీఓ కార్యాలయాల ముందుగా పారుతుంది. దీన్ని ఆధునీకరించేందుకు గత ప్రభుత్వం రూ.కోటికి పైగా నిధులు మంజూరు చేసింది. టెండర్లు సైతం పూర్తి చేసినా పనులు మొదలుపెట్టలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రీ టెండర్లు నిర్వహించారు. గతేడాది నవంబర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి కొల్లాపూర్ పర్యటన నేపథ్యంలో కాల్వ ఆధునీకరణ కోసం అధికారులు గతంలో నిర్మించిన గోడలను కూల్చివేసి, కాల్వ వెంట నిర్మాణాలు, డబ్బాలు తొలగించారు. అయినప్పటికీ పనులు మాత్రం చేపట్టలేదు. దీంతో కాల్వ నిండా మురుగు నిలిచి దోమలు విజృంభిస్తున్నాయి. అలాగే 13వ వార్డులో ఎస్సీ హాస్టల్ నుంచి గోమతి స్కూల్ వరకు మురుగు కాల్వలు నిర్మించకపోవడంతో పెంట్లవెల్లికి వెళ్లే ప్రధాన రహదారి మొత్తం మురుగు పారుతోంది. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో, 1, 5, 8, 17 వార్డుల్లో పలుచోట్ల మురుగు కాల్వలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పట్టించుకోవడం లేదు..



కొల్లాపూర్‌లో ప్రధాన మురుగుకాల్వల ఆధునీకరణ చాలాకాలంగా పెండింగ్‌లో ఉంది. కాల్వలకు మరమ్మతు కూడా చేపట్టకపోవడంతో మురుగు ముందుకు పారడం లేదు. దీంతో దోమల వ్యాప్తి పెరుగుతోంది. కాల్వల ఆధునీకరణపై పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు.

– శ్రీనివాస్, కొల్లాపూర్

ఇళ్ల మధ్యనే మురుగు

కల్వకుర్తి రూరల్: రోజురోజుకూ విస్తరిస్తున్న కాలనీలతో కల్వకుర్తి మున్సిపాలిటీ వేగంగా అభివృద్ధి చెందుతుంది. కాలనీలు విస్తరిస్తున్నా.. అందుకు అనుగుణంగా మున్సిపాలిటీ సదుపాయాలు కల్పించకపోవడంతో ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని 22 వార్డుల పరిధిలో కొత్తగా కాలనీలు ఏర్పాటు అవుతున్నాయి. అయితే చాలాచోట్ల మురుగు పారేందుకు సరైన కాల్వలు లేవు. శ్రీశైలం– హైదరాబాద్ హైవే సమీపంలో ఇళ్ల మధ్యనే మురుగు నిలిచి దుర్గంధం వ్యాపిస్తుంది. ఇక్కడికి సమీపంలోనే పాఠశాల కొనసాగుతున్నా అధికారులకు పట్టడం లేదు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం చేస్తే దుర్గంధం తొలగడంతోపాటు, దోమల సమస్య తీరుతుంది. సుభాష్‌నగర్‌కాలనీ, మార్గదర్శికాలనీ, జింజర్ హోటల్ సమీపంలో, విద్యానగర్, తిలక్‌నగర్, కల్యాణ్‌నగర్– 1, 2, పద్మశ్రీనగర్, వాసవీనగర్ తదితర ప్రాంతాల్లో మురుగు కాల్వలు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



2వ వార్డు కల్యాణ్‌నగర్‌లో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు

పన్నులు చెల్లిస్తున్నాం..



పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మిస్తేనే దుర్గంధం తొలగిపోయి.. దోమల బాధ తగ్గుతుంది. పెరుగుతున్న కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి. పన్నులు చెల్లిస్తున్నా.. సదుపాయాల కల్పన అంతంత మాత్రమే ఉంది.

– మురళి, వాసవీనగర్, కల్వకుర్తి

నిధులు కేటాయిస్తాం



మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ అత్యవసరంగా మురుగు కాల్వల నిర్మాణం అవసరం ఉందో ఆ ప్రాంతాన్ని పరిశీలించి.. రాబోయే బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తాం. మున్సిపాలిటీలో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తాం.

– మహమూద్ షేక్, మున్సిపల్ కమిషనర్, కల్వకుర్తి

న్యూస్‌రీల్

నేటినుంచి వట్టెం వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు



బిజినేపల్లి: ప్రకృతి రమణీయమైన కోవెలగా పేరొందిన వట్టెం శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి సోమవారం వరకు ఘనంగా నిర్వహించనున్నారు. అలాగే శనివారం ఉదయం 10 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం జరగనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. 6 రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలలో స్వామి వారం అలంకారం, రాజభోగ నివేదన, తిరుచ్చిసేవ, సంతానార్థులకు గరుడ ప్రసాద పంపిణీ, స్వామివారి ఉత్సవమూర్తులకు నవకలశ స్నపన తిరుమంజనం, ఎదుర్కోళ్లు, గరుడ వాహన సేవ, కల్పవృక్ష వాహన సేవ, నవకలశ స్నపనం, అశ్వవాహన సేవ, మహా పూర్ణాహుతి, చక్రస్నానం, తీర్థ ప్రసాద వితరణ పల్లకీసేవ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆలయ 39వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలకు భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 452 మంది గైర్హాజరు

కందనూలు: జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా కొనసాగాయి. జిల్లావ్యాప్తంగా 33 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా.. 7,528 మంది విద్యార్థులకు గాను 7,076 మంది హాజరవగా.. 452 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 5,830 మందికి గాను 5,499 మంది, ఒకేషనల్ విభాగంలో 1,698 మందికి గాను 1,577 మంది హాజరై పరీక్ష రాశారు. జనరల్ విభాగంలో 331 మంది, ఒకేషనల్ విభాగంలో 121 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఐఈఓ వెంకటరమణ తెలిపారు.

సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం



అచ్చంపేట రూరల్: సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించి భూసారాన్ని పెంచుదామని జిల్లా వ్యవసాయాధికారి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని సింగారం శివారులో కృష్ణయ్య అనే రైతు వ్యవసాయ క్షేత్రంలో గో ఆధారిత వ్యవసాయంపై గో సేవా విభాగం, గ్రామ భారతి ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు అధిక మోతాదులో వాడటం వల్ల భూమిలో సారం నశించిపోతుందన్నారు. నీటి యాజమాన్య పద్ధతులు అవలంభించడం వల్ల పంటల అధిక దిగుబడిని సాధించవచ్చన్నారు. నీటి వినియోగం ఎక్కువ, తక్కువ అయినా కూడా పంట దిగుబడిపై ప్రభావం చూపుతుందన్నారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ లెక్కల ప్రకారం పంటకు నీరు ఎక్కువ కావడం వల్ల దిగుబడి తగ్గినట్లు వ్యవసాయ శాస్త్రవేత్తలు గుర్తించారన్నారు. జిల్లాలో 50 వేల ఎకరాల మొక్కజొన్న విస్తీర్ణం పెరిగిందని, ఒక పంటకు దాదాపు 9 సంచుల యూరియా వాడినట్లు వెల్లడైందన్నారు. ప్రభుత్వం సేంద్రియ వ్యవసాయానికి ప్రాధాన్యత కల్పిస్తుందని, భవిష్యత్‌లో జిల్లాలో 15 క్లస్టర్లలో 500 ఎకరాలలో ఆర్గానిక్ వ్యవసాయ క్షేత్రాలను పెంపొందించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జాతీయ ఉత్తమ రైతు అవార్డు గ్రహీత లోకసాని పద్మారెడ్డి, జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు వాసు, మండల వ్యవసాయ అధికారి కృష్ణయ్య, 12 క్లస్టర్ల ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

పీయూలో వర్క్‌షాప్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఈ నెల 27, 28 తేదీల్లో ఎంబీఏ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో రీసెర్చ్ మెథడాలజీ, ప్రాజెక్టుపై రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు పీయూ వీసీ శ్రీనివాస్ పేర్కొన్నారు. అందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎంబీఏ చివరి సంవత్సరం విద్యార్థులకు ఈ వర్క్‌షాప్ ఎంతో ఉపయోగకరం అని, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ చెన్నప్ప, ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, కన్వీనర్ అర్జున్‌కుమార్, కో కన్వీనర్ నాగసుధ, జావిద్‌ఖాన్, అరుంధతి, గాలెన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే దివ్యాంగుల్లో ప్రగతి సాధ్యం



దివ్యాంగుడికి చక్రాల కుర్చీ అందజేస్తున్న అదనపు కలెక్టర్ అమరేందర్ తదితరులు

నాగర్‌కర్నూల్: దివ్యాంగ విద్యార్థుల ప్రగతి విద్య ద్వారానే సాధ్యమని అదనపు కలెక్టర్ అమరేందర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని సఖి కేంద్ర ఆవరణలో జిల్లా విద్యా శాఖ సమగ్ర శిక్ష అభియాన్, అలింకో సంస్థ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ అమరేందర్, డీఈఓ రమేష్‌కుమార్ దివ్యాంగులకు మంగళవారం ఉచితంగా సహాయ ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 18 ఏళ్లలోపు వివిధ లోపాలతో బాధపడుతున్న వారిని గతేడాది ఆగస్టులో పరీక్షలు నిర్వహించి 102 మంది దివ్యాగులకు రూ.12 లక్షల వ్యయంతో 233 పరికరాలు పంపిణీ చేశామన్నారు. ఇందులో 78 వినికిడి, 22 చక్రాల కుర్చీలు, 36 సీపీ కుర్చీలు, 16 రొలేటర్స్, 20 చంక కుర్చీలు, 5 బ్రెయిలీ కిట్స్, 2 సుకన్య కేన్ కిట్స్, 93 ఎంఎస్ఐ ఈడీ కిట్స్, 9 ఫుట్ ఆర్థోస్లు ఉన్నాయన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులకు మంచి విద్యను అందిస్తే వారి భవిష్యత్ బంగారుమయం అవుతుందని, ఈ విషయాన్ని ప్రతి తల్లిదండ్రులు గ్రహించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో 3 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని దివ్యాంగ విద్యార్థులు ఉన్నత స్థాయిలో రాణించేందుకు తల్లిదండ్రులతోపాటు ప్రత్యేక అవసరాల ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. డీఈఓ రమేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన ఉపాధ్యాయులతో విద్య అందించడంతోపాటు, ప్రతి శనివారం దివ్యాంగ విద్యార్థుల ఇంటి దగ్గరే ఫిజియోథెరపీ నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ వెంకటయ్య, సఖి కోఆర్డినేటర్ సునీత, ప్రత్యేక అవసరాలు ఉపాధ్యాయులు ప్రకాష్, రాఘవేందర్, శ్యామ్, శ్రీలత, రేనమ్మ, వసంత, విజయలక్ష్మి, విజయ, జయప్రకాష్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



ముమ్మరంగా సహాయక చర్యలు

- ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లోకి రోబోటిక్ సంస్థ ప్రతినిధులు
- కమ్యూనికేషన్ వ్యవస్థ ఏర్పాట్లు

– అచ్చంపేట/మన్ననూర్

వివరాలు 8లో..

క్రీడలతో విద్యార్థుల్లో శారీరక దృఢత్వం



మెడిసిన్ బాల్ త్రో క్రీడను పరిశీలిస్తున్న డీటీడీఓ అధికారులు

బల్మూర్: క్రీడా పోటీలతో విద్యార్థుల ఆరోగ్య సామర్థ్యాలు పెరిగి శారీరక దృఢత్వం మెరుగుపడుతుందని ఐటీడీఏ అధికారి శంకర్ అన్నారు. మండలంలోని బాణాల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నాలుగో తరగతి విద్యార్థులకు క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా 24 గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల నుంచి సుమారు 90 మంది విద్యార్థులు హాజరుకాగా.. వారికి ఎత్తు, బరువు, 30 మీటర్ల పరుగు, మెడిసిన్ బాల్‌త్రో, ఫ్లయింగ్ రన్స్, స్టాండింగ్ బాడీ జంపు తదితర తొమ్మిది రకాల క్రీడా పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభకనబర్చిన బాలురు 10 మంది, బాలికలు 10 మందిని ఈ నెల 21న హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో జరిగే రాష్ట్రస్థాయి ఎంపికలకు పంపిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏసీఎంఓ తిరుపతయ్య, స్పోర్ట్స్ ప్రత్యేకాధికారి భీమ్లానాయక్, హెచ్ఎంలు చంద్రశేఖర్, బయన్న, రాములు, పీడీలు నరేష్, ఆంజనేయులు, రాజు, జ్యోతి, పెద్దయ్య, అంజి, జానకిరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆ భూములు గిరిజనులకే దక్కాలి

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్



మాట్లాడుతున్న జాటోత్ హుస్సేన్ నాయక్

ఊర్కొండ: గిరిజనులకు సంబంధించిన భూములు వారికే దక్కాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ అన్నారు. మండలంలోని గునగుండ్లపల్లి పంచాయతీ రెడ్యాతండా సమీపంలోని ఊర్కొండపేట రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నం.186లో గల 109 ఎకరాల అసైన్డ్ భూమి తరతరాల నుంచి గిరిజనుల స్వాధీనంలో ఉందని, ఆ భూమిని ప్రస్తుతం ఇతరులు స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తుండటంతో తండావాసులు జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం రెడ్యాతండాను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు సందర్శించి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అసైన్ భూములు గిరిజనులకు దక్కే విధంగా చూస్తామని, అదేవిధంగా తండా ప్రజల హక్కులను కాలరాసే విధంగా ఎవరు ప్రయత్నించినా చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. గత ప్రభుత్వాలు పట్టాలు ఇచ్చినప్పటికీ వారు ఏనాడు కూడా ఇక్కడ సేద్యం చేయలేదని, అలాంటి వారు ఇప్పుడు గిరిజనులను మా భూములు మాకే చెందుతాయని భయభ్రాంతులకు గురి చేయడం సరికాదన్నారు. గిరిజనులకు సంబంధించిన భూములను గిరిజనులకు చెందేలా తనవంతు కృషిచేస్తానన్నారు. అధికారులు ఎలాంటి తప్పిదాలు చేయకుండా అసైన్డ్ భూములు నిరుపేద గిరిజనులకు దక్కేలా చూడాలని ఆదేశించారు. వాస్తవ పరిస్థితులను పరిశీలించడానికి ఇక్కడికి వచ్చామని, గిరిజన నాయకులు మాట్లాడిన విధానం చూస్తుంటే ఇక్కడ కొందరు కావాలని భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు తెలుస్తుందని, అలాంటి వారిని ఉపేక్షించేది లేదన్నారు. అధికారులు వాస్తవాలను నెల రోజుల్లో తెలియజేసేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో కల్వకుర్తి ఆర్డీఓ శ్రీను, తహసీల్దార్ రామకోటి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, బీజేపీ ఎస్టీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్, ఓయూ జేఏసీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు రాజునాయక్, తెలంగాణ సెక్రటేరియట్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రేమ్నాయక్, నాయకులు జనార్దన్‌రెడ్డి, రమేష్‌నాయక్, దుర్గాప్రసాద్, రాజేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యువతతోనే దేశ ప్రగతి

నాగర్‌కర్నూల్ క్రైం: యువతతోనే దేశప్రగతి ముడిపడి ఉందని, దేశ అభివృద్ధిలో యువత కీలకం అని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్ అన్నారు. కేంద్ర యువజన క్రీడా సర్వీసులు, మై భారత్, నెహ్రూ యువకేంద్ర సహకారంతో స్వామివివేకానంద సేవా బృందం ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మంగళవారం యువ ఉత్సవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్‌లో యువత పాత్ర ముఖ్యమైనదని, చదువుతోపాటు సామాజిక స్పృహ కలిగి ఉండాలన్నారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులపై సోషల్‌మీడియా ప్రభావం ఎక్కువగా ఉందని, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. ఈ నెలలో జరగనున్న జాతీయ యూత్ పార్లమెంట్ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం యువ ఉత్సవంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో ప్రతిభచాటిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, స్వామివివేకానంద సేవా బృందం అధ్యక్షుడు శివకుమార్, జిల్లా యువజన అధికారి కోటానాయక్, కల్యాణ్‌నాయక్, సుధాకర్, లక్ష్మీనర్సింహ, అజయ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పదంగా వృద్ధురాలి మృతి


చిన్నమ్మ(ఫైల్)

గద్వాల క్రైం: అనుమానాస్పదంగా వృద్ధురాలు మృతి చెందిన ఘటన గద్వాలలో చోటుచేసుకున్నట్లు పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. వివరాలు.. మోమిన్ మహోల్ల కాలనీకి చెందిన చిన్నమ్మ(85) కొన్ని రోజుల క్రితం కిందపడి తీవ్ర అనారోగ్యానికి గురైంది. కుటుంబ సభ్యులు ఉన్నా ఆమె బాగోగులను పట్టించుకునే వారు కాదు. రాఘవేంద్ర కాలనీలోని అనాథశ్రమంలో ఉండేది. వారం రోజుల క్రితం వృద్ధురాలిని కుమారులు జలదుర్గం రమేష్, రాజు మోమిన్ మహోల్లలోని స్వంత ఇంట్లో(పాడుబడ్డ)కి తీసుకొచ్చారు. ఆమెకు వంతుల వారీగా ఆహారం అందించేవారు. అయితే సోమవారం రాత్రి కుటుంబ సభ్యులు వృద్ధురాలికి ఆహారం అందించి చీకటి గది కావడంతో వెలుతురు కోసం కొవ్వొత్తిని వెలిగించి మంచం సమీపంలో పెట్టి వెళ్లారు. ఆమె నిద్రించే క్రమంలో కొవ్వొత్తికి దుప్పటి తగిలి మంటలు వ్యాపించి ఉండొచ్చని అనుమానం వ్యక్తమవుతోంది. అయితే స్థానికులు మాత్రం ఆమెను కుటుంబ సభ్యులే హత్య చేసి ఉంటారని ఆరోపిస్తున్నారు. ఘటనాస్థలికి గద్వాల సీఐ శ్రీను చేరుకొని పరిశీలించారు. కేసు విచారణలో నిజనిజాలు నిర్ధారణ అవుతాయని ఆయన వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు నుంచి పడి వ్యక్తి..

ఆత్మకూర్: ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ అశోక్ కథనం మేరకు.. సోమవారం అర్ధరాత్రి మండల పరిధిలోని శ్రీరాంనగర్ రైల్వేస్టేషన్ – గద్వాల రైల్వేస్టేషన్ మధ్య 184వ కిలోమీటరు వద్ద పట్టాలపై 45 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందింది. మంగళవారం ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు. మరిన్ని వివరాలకు సెల్‌నంబర్లు 87126 58608, 83412 52529 సంప్రదించాలని సూచించారు.

బావిలో పడి..

శాంతినగర్: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ జములమ్మ ఆలయ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. బంధువులు జములమ్మ దేవర చేస్తున్నారని కలుకుంట్లకు చెందిన మద్దిలేటి (36) ఆలయానికి వచ్చి వెనక ఉన్న బావిలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. బంధువుల ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు శాంతినగర్ పోలీసులు వివరించారు.

లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం

తాడూరు: మండల కేంద్రానికి సమీపంలోని మల్కాపూర్ గేట్ కాజ్వే బ్రిడ్జి వద్ద మంగళవారం సాయంత్రం కోళ్ల ఎరువుతో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎలాంటి నష్టం వాటిల్లలేదు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

మామిడితోట దగ్ధం



రాజాపూర్: మండలంలోని రాయపల్లికి చెందిన మహిళా రైతు మాధవి మామిడితోట సోమవారం రాత్రి అగ్నికి ఆహుతైంది. గ్రామస్తుల కథనం మేరకు.. పోలేపల్లి శివారులోని పరిశ్రమల నుంచి వెలువడే పొగతో పాటు నిప్పు రవ్వలు వచ్చి రైతు పొలంలో పడి ఎండిన గడ్డి అంటుకొని మంటలు వ్యాపించి మామిడి తోట కాలిపోయిందన్నారు. రైతులను నష్టపరుస్తున్న పరిశ్రమలపై అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జడ్చర్లలో పశుగ్రాసం..



జడ్చర్ల: పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో కౌలు రైతు సంజీవ్ నిల్వ చేసిన పశుగ్రాసం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని కాలి బూడిదైంది. వరి గడ్డివాము నుంచి మంగళవారం ఒక్కసారిగా పొగలు రావడంతో రైతు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేసి ప్లాస్టిక్‌తో చెల్లాచెదురు చేసినా ఫలితం లేకపోయింది. సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని.. ప్రభుత్వ పరంగా సాయం అందించి ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు.

గళం విప్పుతాం.. నిధులు రాబడతాం

అసెంబ్లీ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో నెలకొన్న దీర్ఘకాల సమస్యలు, ప్రాజెక్టుల నిర్మాణాలు, సాగునీటి సరఫరా, నిర్వాసితుల నష్టపరిహారం, రోడ్ల విస్తరణ, విద్యాసంస్థలు, పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి కల్పన తదితర వాటిపై తమ గళం వినిపించి పరిష్కారానికి కృషిచేస్తామని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు. అయితే ప్రస్తుతం నిర్వహించేది బడ్జెట్ సమావేశాలు కావడంతో అధికంగా నిధులు మంజూరుకు కృషిచేస్తామని పేర్కొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



నిధుల కేటాయింపు..



అసెంబ్లీ సమావేశాల్లో విద్య, వైద్యం, ఉపాధి కల్పనపై ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తా. నూతనంగా ఏర్పడిన మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌కు ప్రత్యేక నిధుల కేటాయింపు, ఏదైనా ఉన్నత విద్యా సంస్థ మంజూరు, విద్యాలయాల్లో మౌలిక వసతుల కల్పన, జిల్లాలో పరిశ్రమలు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ఏర్పాటు, ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం, పెద్ద గ్రామాల్లో హెల్త్‌సెంటర్ల ఏర్పాటు గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాను.

– యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే, మహబూబ్‌నగర్

విద్య, వ్యవసాయంపైనే..



బడ్జెట్ సమావేశాల్లో నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి సంబంధించి విద్య, వ్యవసాయ రంగాల్లో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా. పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతలకు సంబంధించి డిస్ట్రిబ్యూటరీలు పూర్తి చేసేలా నిధులు మంజూరు చేయాలని కోరుతా. ప్రభుత్వ జూనియర్ కళాశాల సొంత భవన నిర్మాణానికి రూ.9 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. త్వరలో నిధులు కూడా మంజూరు కానున్నాయి.

– కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే, నాగర్‌కర్నూల్

పరిశ్రమల ఏర్పాటు కోసం



పేట నియోజకవర్గంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించవచ్చు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణం, నియోజకవర్గంలో ప్రైవేట్ అద్దె భవనాల్లో కొనసాగుతున్న డిగ్రీ, జూనియర్ ప్రభుత్వ కళాశాలలకు సొంత భవనాలకు నిధులు కావాలని, ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా ప్రాజెక్టుల రూపకల్పన చేయాలని కోరుతాను.

– చిట్టెం పర్ణికారెడ్డి, ఎమ్మెల్యే, నారాయణపేట

ముంపు గ్రామాలపై..



మక్తల్ నియోజకవర్గంలో ఏళ్ల తరబడిగా ముంపు గ్రామాల ప్రజల సమస్యలు తీరడం లేదు. ఈ సమస్యలను తీర్చాలని అసెంబ్లీలో చర్చిస్తా. జూరాల బ్యాక్ వాటర్‌లో ముంపునకు గురైన అనుగొండ, గడ్డంపల్లి, దాదాన్‌పల్లి, అంకేన్‌పల్లి గ్రామాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్ కింద ముంపునకు గురైన ఉజ్జెల్లి, గార్లపల్లి, నేరడుగం, భూత్పూర్‌లో ఊట నీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అసెంబ్లీలో చర్చించి శాశ్వత పరిష్కారానికి కృషిచేస్తా.

– వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే, మక్తల్

సాగునీరు, పర్యాటక రంగం..



అచ్చంపేట నియోజకవర్గానికి సాగునీరు తేవడంపైనే ప్రధానంగా అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తా. ఉన్నత విద్యపై దృష్టిపెడతాం. ఈ ప్రాంతంలో 3.50 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టుల నిర్మాణం, ఇప్పటికే మంజూరైన ఉమ్రాబాద్ లిఫ్టుల ఏర్పాటు త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతాను. సీఎం సహకారంతో నల్లమల ప్రాంతాన్ని మరో కోనసీమగా మార్చడమే నా లక్ష్యం. నల్లమలలోని వనరుల ద్వారా ఉపాధి అవకాశాలు, పరిశ్రమలు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై గళం వినిపిస్తాను.

– వంశీకృష్ణ, ఎమ్మెల్యే, అచ్చంపేట

ప్రధాన సమస్యలపై దృష్టి



అలంపూర్ రైతులు ప్రధానంగా సాగు నీటిని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తుమ్మిళ్ల ఎత్తిపోతల ద్వారా పూర్తిస్థాయిలో సాగునీరు అందించడానికి మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి. అలాగే వంద పడకల ఆస్పత్రిని నిర్మించి ప్రారంభించినా.. ప్రస్తుతం వైద్య సేవలు అందించడం లేదు. దీంతో వైద్యం కోసం ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాను. అలాగే అసంపూర్తిగా ఉన్న రోడ్ల పనులు పూర్తి చేయాలని, అధ్వానంగా ఉన్న రోడ్ల ఆధునీకరణ అంశాలను అసెంబ్లీలో ప్రస్తావిస్తాను.

– విజయుడు, ఎమ్మెల్యే, అలంపూర్

సాగునీరు, విద్య, వైద్యం



గద్వాల నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టు గుడ్డెందొడ్డి జలాశయం సామర్థ్యం పెంపు, ర్యాలంపాడు మరమ్మతుతోపాటు జలాశయం పెంపుపై కూడా ప్రధానంగా ప్రస్తావిస్తాను. అదేవిధంగా మెడికల్ కాలేజీలో స్టాఫ్ నియామకం, జిల్లా ఆస్పత్రిని 500 బెడ్లకు పెంచాలని కోరుతాను. ఇదివరకే దీనిపై పలుమార్లు సీఎం, సంబంధిత మంత్రులు, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులకు వ్యక్తిగతంగా లేఖలు రాశాను. అసెంబ్లీ సమావేశాల్లో వీటిపైనే మరోసారి ప్రస్తావించి ప్రభుత్వ సాయంతో వీటిని సాధించేలా కృషి చేస్తాను.

– బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, గద్వాల

గొల్లపల్లి రిజర్వాయర్ ప్రతిపాదనలపై..



నియోజకవర్గంలో మరో పదివేల ఎకరాలకు సాగునీరందించేందుకు రేవల్లి మండలం గొల్లపల్లి వద్ద నూతనంగా మినీ రిజర్వాయర్ నిర్మాణం కోసం ప్రతిపాదనను ప్రభుత్వానికి అందజేశాం. ఈ అంశంపై అసెంబ్లీలో ప్రస్తావిస్తా. ఇప్పటికే కేఎల్ఐ, భీమా, జూరాల సాగునీటి కాల్వలతో చాలా మేరకు సాగునీరు అందుతుంది. ప్రభుత్వం, ఫారెస్ట్ అధికారుల నుంచి అనుమతులు లభిస్తే గొల్లపల్లి రిజర్వాయర్ పనులు వేగంగా పూర్తి చేస్తాం. రింగ్ రోడ్డు, సాగునీటి కాల్వల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. దరఖాస్తు చేసుకున్న 2,713 మంది రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని విన్నవిస్తాం.

– తూడి మేఘారెడ్డి, ఎమ్మెల్యే, వనపర్తి

నిర్వాసితుల సమస్యల ప్రస్తావన



జడ్చర్ల నియోజకవర్గంలోని ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి సంబంధించిన అంశాలను అసెంబ్లీలో ప్రస్తావిస్తాను. రూ.25 లక్షల వరకు ఆర్‌అండ్‌ఆర్ పెంపుదల చేయాలని డిమాండ్ చేస్తాను. అదేవిధంగా త్వరితగతిన ముంపు గ్రామాలకు అవార్డ్ పాస్ చేసి రిజర్వాయర్ పనులను పూర్తి చేయాలని కోరుతాను. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని విన్నవిస్తాను.

– అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

'కల్వకుర్తి'ని పూర్తి చేయడమే ధ్యేయం



నియోజకవర్గ రైతులకు వరప్రదాయిని కల్వకుర్తి ఎత్తిపోతల పథకం. ఈ ప్రాజెక్టు ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని, డిస్ట్రిబ్యూటరీ కాల్వలు పూర్తి చేయాలని శాసనసభలో ప్రభుత్వాన్ని కోరుతాను. దీంతోపాటు విద్య, వైద్యం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించడంతోపాటు.. మంజూరైన పనులకు టెండర్లు వేయాలని ప్రభుత్వాన్ని కోరుతా. అలాగే ఇప్పటికే మంజూరైన రోడ్ల నిర్మాణం వెంటనే చేపట్టాలని సభ దృష్టికి తీసుకెళ్తాను.

– కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే, కల్వకుర్తి

ముమ్మరంగా సహాయక చర్యలు


రెస్క్యూ బృందాలకు సూచనలు చేస్తున్న అరవింద్‌కుమార్, కలెక్టర్ బదావత్ సంతోష్

- ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లోకి రోబోటిక్ సంస్థ ప్రతినిధులు
- కమ్యూనికేషన్ వ్యవస్థ ఏర్పాట్లు


టన్నెల్‌లోకి వెళ్తున్న కాడవర్ డాగ్ స్క్వాడ్స్

అచ్చంపేట/మన్ననూర్: ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో జరుగుతున్న సహాయక చర్యలకు రోబోలను ఉపయోగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మేరకు మంగళవారం ఉదయం హైదరాబాద్‌కు చెందిన అన్వి రోబోటిక్స్ సంస్థకు చెందిన ఏఐ బేస్ట్ కెమెరా సదుపాయం గల రోబోటిక్‌లను తీసుకెళ్లారు. సంస్థ ప్రతినిధులు విజయ్, అక్షయ్ లోకో ట్రైన్‌లో సొరంగంలోకి వాటిని తీసుకెళ్లారు. అన్వి రోబోటిక్ సంస్థకు చెందిన ప్రతినిధులు టన్నెల్ దగ్గర ఆఫీసులో కమ్యూనికేషన్ వ్యవస్థ ఏర్పాట్లను ప్రారంభించారు. ప్రమాద ప్రదేశంలో చేపట్టే సహాయక చర్యల్లో ఎలాంటి ప్రాణనష్టం సంభవించకుండా రోబోలను ఉపయోగించుకుంటున్నట్లు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ తెలిపారు. సహాయక చర్యల్లో కావాల్సిన సామగ్రితోపాటు సహాయక బృందాలు మరోమారు కాడవర్ డాగ్స్ ప్రమాద ప్రదేశానికి వెళ్లాయని తెలిపారు. సమావేశంలో ప్రస్తుత సహాయక చర్యల పురోగతిని సమీక్షించి, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. టన్నెల్ సహాయక చర్యలలో అనుసరించాల్సిన విధివిధానాలు, రోబోటిక్స్, మెకానికల్ పరికరాల వినియోగం, మట్టి తొలగింపు ప్రక్రియ, భద్రతా చర్యలపై విస్తృతంగా చర్చించిన అధికారులు సహాయక చర్యలను మరింత వేగవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. సమావేశంలో కలెక్టర్ బదావత్ సంతోష్, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అన్వి రోబోటిక్స్, హైడ్రా, ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి, ర్యాట్ మైనర్స్, దక్షిణ మధ్య రైల్వే తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో..

ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాద సంఘటనలో కార్మికులను కాపాడటం కోసం చేస్తున్న సహాయక చర్యల్లో పాల్గొంటున్న వారికి భోజన ఏర్పాట్లు గిరిజన సంక్షేమ శాఖ చేపడుతోంది. కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశాల మేరకు డీటీడీఓ ఫిరంగి పర్యవేక్షణలో 18 రోజులుగా సహాయక చర్యల్లో పాల్గొంటున్న రెస్క్యూ బృందాలతోపాటు అక్కడ పనిచేస్తున్న వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పోలీసులతోపాటు మీడియాకు మూడు పూటలా భోజన ఏర్పాట్లు చేస్తుంది.

రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు
- నేడు పార్వతి సమేత రామలింగేశ్వరుడి కల్యాణ మహోత్సవం


గో పూజతో ఉత్సవాలను ప్రారంభిస్తున్న పండితులు


ధ్వజారోహణ చేసి పూజలు చేస్తున్న పండితులు

అడ్డాకుల: మండలంలోని కందూర్ శివారులో స్వయంభూగా వెలిసి దక్షిణకాశీగా పేరొందిన శ్రీరామలింగేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు గోపూజతో మంగళవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన యాగశాలలో భూతబలి కార్యక్రమం నిర్వహించి యాగశాల ప్రవేశం చేశారు. విఘ్నేశ్వర పూజ, అగ్నిప్రతిష్ఠ, అంకురారోహణ, ధ్వజారోహణం, బలిహరణ కార్యక్రమాలను పండితులు ఘనంగా నిర్వహించారు. ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజ స్థాపన చేసి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆలయ ఆవరణలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం ఉదయం ఆలయంలో పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కల్యాణానికి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయంలో చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. ఈఓ రాజేశ్వరశర్మ, జూనియర్ అసిస్టెంట్ అనంతసేన్‌రావు, ఆలయ నిర్వాహకులు రవీందర్‌శర్మ, కారెడ్డి నాగిరెడ్డి, తోట శ్రీహరి, దామోదర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, విజయలక్ష్మి, కారెడ్డి లత, దేవన్న యాదవ్, ఆలయ పూజారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాగుపాముకు చికిత్స


పాముకు చికిత్స చేస్తున్న సదాశివయ్య

జడ్చర్ల టౌన్: మండలంలోని ఆల్వాన్‌పల్లిలో పట్టుకునే క్రమంలో గాయపడిన నాగుపాముకు సర్పరక్షకుడు డా.సదాశివయ్య చికిత్స అందించి కాపాడారు. వివరాలు.. ఆల్వాన్‌పల్లిలో నాగుపామును గుర్తించిన యువకులు సర్పరక్షకుడు డా.సదాశివయ్యకు ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. దీంతో ఆయన తన శిష్యులైన రాహుల్, రవీందర్ అక్కడికి చేరుకునేలోపు నాగుపాము సమీపంలోని రంధ్రంలోకి వెళ్లింది. దాన్ని తవ్వి పామును బయటకు తీసేందుకు యువకులు గడ్డపారతో తవ్వుతుండగా పాము నడుములో దిగబడింది. అది ఒక్కసారిగా బుసలు కొడుతూ బయటికొచ్చింది. అదిగమనించిన యువకులు అక్కడి నుంచి పరారయ్యారు. అక్కడికి చేరుకున్న రాహుల్, రవీందర్ చాకచక్యంగా పామును పట్టుకొని జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల జీవ వైవిధ్య సంరక్షణ కేంద్రానికి తీసుకొచ్చారు. అక్కడ డా.సదాశివయ్య పాముకు చికిత్స అందించి కట్టువేసి కాపాడారు. ప్రస్తుతం గాయపడిన పామ ఇదే కేంద్రంలో ఉంచారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు


స్కానింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రాష్ట్ర వైద్యశాఖ అధికారి డా. జయంతిరెడ్డి

కోస్గి: స్కానింగ్ కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వైద్యశాఖ అధికారి డా. జయంతిరెడ్డి హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పలు స్కానింగ్ కేంద్రాలను జిల్లా వైద్యాధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. స్కానింగ్ చేసే వారి వివరాలు విధిగా సమగ్రంగా నమోదు చేయాలని, ఆధార్ కార్డు, పూర్తి చిరునామా, స్కానింగ్ తీయడానికి గల కారణాలు ఉండాలని సూచించారు. రేడియాలజిస్టులే స్కానింగ్ తీయాలన్నారు. ఆమె వెంట జిల్లా ఉప వైద్యాధికారి డా. శైలజ తదితరులు ఉన్నారు.


దాడి కేసులో నిందితులకు జైలుశిక్ష

జడ్చర్ల: మండలంలోని కిష్టారం గ్రామంలో దాయాదులు ఓ కుటుంబంపై దాడి చేసిన కేసులో తొమ్మిది మంది నిందితులకు మూడు నెలలు జైలుశిక్షతో పాటు ఒక్కో నిందితుడికి రూ.500 జరిమానా విధిస్తూ మంగళవారం మహబూబ్‌నగర్ కోర్టు జడ్జి ముద్దసిర్‌మహ్మద్ తీర్పు ఇచ్చినట్లు కోర్టు కానిస్టేబుల్ యాసిన్ తెలిపారు. అక్టోబర్ 12, 2017లో తమ కుటుంబ సభ్యులపై దాయాదులు పొన్నకంటి వెంకటయ్య, మౌనిందర్, సురేందర్, హరేందర్, లక్ష్మయ్య, మానస, లక్ష్మమ్మ,సరోజ, రాజులు దాడి చేసి గాయపరిచారని బాధితుడు పొన్నకంటి రాములు జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. విచారించిన జడ్జి నిందితులకు శిక్షను విధిస్తూ తీర్పు వెల్లడించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవాబుపేట: బైక్ అదుపు తప్పి కింద పడి తీవ్ర గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. గత నెల 27న పత్తేపూర్‌కి చెందిన కమ్మరి శ్రీనివాస్‌చారి(40) అనే వ్యక్తి బైక్‌పై జిల్లా కేంద్రానికి వెళ్లాడు. పని ముగించుకొని తిరిగి ఇంటికి వస్తుండగా కాకర్లపహాడ్ సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావటంతో స్థానికులు 108 వాహనంలో జిల్లా ఆస్పత్రిలో చేర్పించి కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు కమ్మరి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొప్పునూరులో మరొకరు..


నరసింహా రెడ్డి(ఫైల్)

చిన్నంబావి: పురుగుమందు తాగి చికిత్స పొందుతూ కోలుకోలేక ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కొప్పునూరులో చోటుచేసుకున్నట్లు ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. వివరాలు.. కొప్పునూరుకి చెందిన బంకమిది నరసింహారెడ్డి (56) అనారోగ్య సమస్యలతో సోమవారం పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కొల్లపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నాగర్ కర్నూలు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌పై నుంచి కిందపడి..


ఆనందం(ఫైల్)

చిన్నచింతకుంట: మోటార్ సైకిల్ అదుపు తప్పి కిందపడి గాయాలపాలై చికిత్స పొందుతూ ఓ వ్యక్తి చెందినట్లు ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్ తెలిపారు. వివరాలు.. మండలంలోని లక్ష్మీదేవ్‌పూర్‌కి చెందిన పల్లె పాగు ఆనందం(50) ఈ నెల 7న తన బైక్‌పై చిన్నచింతకుంటకు వచ్చాడు. కూరగాయలు తీసుకొని గ్రామానికి తిరుగు ప్రయాణం అయ్యాడు. మార్గమధ్యలో బైక్ అదుపు తప్పి కిందపడగా ఆనందంకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందాడు. మృతుడి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్లుప్తంగా

ఆలయంలో కొత్త హుండీలు ఏర్పాటు

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లి లక్ష్మీనరసింహ్మస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను పురష్కరించుకొని మంగళవారం దాతల సహకారంతో కొత్త హుండీలను ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ పాలక మండలి సభ్యురాలు ఎలుక స్వరూప సుదర్శన్‌రెడ్డి తోపాటు మామిళ్లపల్లి గ్రామానికి చెందిన బాల కిష్టమ్మ, జంగయ్యల జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు రెండు హుండీలను అందజేశారు.

హుండీ లెక్కింపు

ఇటీవల భక్తులు సమర్పించిన కానుకలను ఆలయ కమిటీ సభ్యులు లెక్కించారు. మొత్తం రూ.47,765లు భక్తులు కానుకలుగా సమర్పించినట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ నర్సింహులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నర్సింహరావు, కమిటీ సభ్యులు స్వరూప, గణేష్‌గౌడ్, ప్రదీప్‌ప్రసాద్, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణయ్య ఆలయ సిబ్బంది నాగరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లకు చార్జీ మెమోలు

వెల్దండ: మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లకు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి చిన్న ఓబులేష్ చార్జీ మెమోలు జారీ చేసినట్లు ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ లక్ష్మీదేవికి సస్పెన్షన్ నోటీసు, విజయ్‌కుమార్‌కు చార్జీ మెమో జారీచేసినట్లు పేర్కొన్నారు.

'ప్రణయ్ హత్యకేసులో న్యాయం గెలిచింది'

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రణయ్ హత్యకేసులో న్యాయం గెలిచిందని దళితహక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొమ్ము భరత్ అన్నారు. మంగళవారం స్థానిక లక్ష్మణచారి భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిందితుల్లో ఒకరికి ఉరిశిక్ష, మిగతా ఆరుగురికి జీవితఖైదు విధించడంతో సమాజం గర్వపడుతోందని పేర్కొన్నారు. కులదురహంకార హత్యలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి బండి లక్ష్మీపతి, నాయకులు శివశంకర్, శ్రీనివాస్, రాము, భీమయ్య, భగవంత్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ

వెల్దండ: మండలంలోని గుండాల అంబా రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మంగళవారం శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగానికి అభిషేకాలు చేశారు. వ్రతాలు ఆచరించి మొక్కులను చెల్లించుకున్నారు. ఈఓ ప్రసాద్, ఆలయ అర్చకులు బాలస్వామిశర్మ, కృష్ణయ్యశర్మ, శివకుమార్‌శర్మ, నరహరిశర్మ, సంతోష్‌శర్మ, సురేష్‌శర్మ, ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ఉద్యోగ నోటిఫికేషన్లు ప్రకటించొద్దని దీక్ష

పెద్దకొత్తపల్లి: ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందే వరకు ఉద్యోగ నోటిఫికేషన్లు నిలిపివేయాలని కోరుతూ మండల కేంద్రంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ నాయకులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. అగ్రస్వామి, రామకృష్ణ, పరశురాముడు, మధు విజయ్, సురేష్, యాదగిరి పాల్గొన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి



తాడూరు: వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలను సంరక్షించాలని ఎంపీడీఓ ఆంజనేయులు కోరారు. మంగళవారం మండలంలోని ఎంగంపల్లి, గోవిందాయ్‌పల్లి గ్రామాలను సందర్శించారు. వాటరింగ్ డే సందర్భంగా రోడ్డు పక్కన నాటిన మొక్కలకు నీటిని అందించారు. అదేవిధంగా నర్సరీలను పరిశీలించి వనమహోత్సవ కార్యక్రమానికి మొక్కలను సిద్ధం చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట ఏపీఓ చంద్రసిద్ధార్థ, ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

తెలకపల్లి: మండలంలోని వట్టిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రమాదభరితంగా కల్వర్టులు

- పట్టించుకోని అధికారులు

తాడూరు: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులపై నిర్మించిన కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. వాహనదారులు రాకపోకలు చేసేందుకు భయాందోళనకు గురవుతున్నారు. కల్వర్టులు శిథిలావస్థకు చేరినా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. లోలెవెల్ కల్వర్టు దగ్గర సీసీ ఏర్పాటు చేశారు కాని రక్షణ గోడలు నిర్మించడంలో నిర్లక్ష్యం వహించారు. అవరమైన చోట కాజ్‌వే బ్రిడ్జిలు నిర్మించకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

మండలంలో ఇలా..

మండలంలోని యాదిరెడ్డిపల్లి నుంచి అంతారం, ఎట్టిదార్‌పల్లి మీదుగా ఐతోలు వెళ్లే రోడ్డు అనేక మలుపులు తిరిగి ఉండడంతో పాటు యాదిరెడ్డిపల్లి సమీపంలో లోలెవెల్ కల్వర్టు దగ్గర వరదనీరు ఉధృతంగా ప్రవహించి కొన్నిరోజుల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోతాయి. అదే విధంగా అంతారం సమీపంలో వర్షపు నీటితో పాటు పక్కనే ఉన్న చెరువు అలుగు నీటితో అధికంగా ప్రవహించడంతో వరద ఉధృతి తగ్గేవరకు రాకపోకలు బంద్ అవుతాయి. ఐతోలు–శిర్సవాడ ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు ఐతోలు సమీపంలో లోలెవెల్ కల్వర్టు వరద తాకిడికి ఆర్టీసీ బస్సులు సైతం రాకపోకలు నిలిపివేస్తారు. నాగ్‌దేవ్‌పల్లి–ఆకునెల్లికుదురు రోడ్డు మధ్యన ఉన్న కల్వర్టు దగ్గర గత ఏడాది పెంటయ్య గల్లంతు అయ్యాడు.



రక్షణ గోడలు లేని నాగ్‌దేవ్‌పల్లి కల్వర్టు

అధికారులు పరిశీలించాలి



మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలకు వెళ్లే లింక్ రోడ్లపై ఉన్న లోలెవెల్ కల్వర్టులను అధికారులు పరిశీలించారు. ప్రమాదాల బారిన పడుతున్నా పట్టించుకోవడం లేదు. ఐతోలు దగ్గర ఉన్న కల్వర్టు సమీపంలో గత వర్షాకాలంలో వాగులో కొట్టుకుపోతున్న కుటుంబాన్ని గ్రామస్తులు కాపాడారు. అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలి.

– బాలెం వెంకటయ్య, ఆకునెల్లికుదురు

ప్రతిపాదనలు పంపాం...

లింకు రోడ్లపై ఉన్న కల్వర్టుల నిర్మాణాల కోసం ప్రతిపాదనలు పంపాం. ఆకునెల్లికుదురు, అంతారం సమీపంలో ఉన్న కల్వర్టుల నిర్మాణాలకు నిధులు మంజూరు అయ్యాయి. త్వరలో నిర్మాణ పనులు చేపడతాం.

– శివకృష్ణ, ఏఈ, తాడూరు

నిరుద్యోగ నిర్మూలనే లక్ష్యం

కల్వకుర్తి రూరల్: నియోజకవర్గంలో నిరుద్యోగ నిర్మూలనే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ పనిచేస్తుందని టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఐక్యత కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు జాబ్‌మేళాలు నిర్వహించి 400 మందికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. మహిళలకు ప్రత్యేకంగా జాబ్‌మేళా ఏర్పాటు చేసి 132 మంది మహిళలు ఉద్యోగాలు పొందారన్నారు. అంబులెన్స్‌లను ఏర్పాటు చేసి 7000 మందికి అత్యవసర సేవలు అందించామన్నారు. కంటి చికిత్స శిబిరాలు నిర్వహించి 300 మంది ప్రజలకు కంటి ఆపరేషన్లు చేయించామని వివరించారు. ఈనెల 25న కల్వకుర్తి పట్టణంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. దాదాపు 50 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరవుతారని 5000 మంది నిరుద్యోగులకు విద్య ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అనంతరం పోస్టర్లను ఆయన విడుదల చేశారు. రాపోతుల అనిల్ గౌడ్, శ్రీరాములు, శ్రీపతి, యూసుఫ్, శ్రీను నాయక్ తదితరులు, ఐక్యత సభ్యులు పాల్గొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న రాఘవేందర్ రెడ్డి

సీడీపీఓకు వినతి



నాగర్‌కర్నూల్‌రూరల్: ఈ నెల 17, 18 తేదీలలో 48 గంటల పాటు ధర్నా నిర్వహిస్తునట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు కోరారు. మంగళవారం సీడీపీఓకు ఆయన వినతిపత్రం అందజేశారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కందికొండ గీత, నాయకులు రామయ్య, కోశాధికారి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

48 గంటల దీక్ష

కల్వకుర్తి రూరల్: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయొద్దని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఐసీడీఎస్ కార్యాలయంలో ఆయన వినతి పత్రం అందజేశారు. ఈనెల 17, 18న కలెక్టరేట్ ఎదుట 48 గంటల దీక్ష చేపట్టినట్లు పేర్కొన్నారు. అలివేల, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



కొల్లాపూర్: పట్టణంలోని పీజీ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం చట్టాలు, సైబర్ నేరాలపై జిల్లా బాలల సంక్షేమ సమితి అధ్యక్షుడు వై.లక్ష్మణ్‌రావు, కొల్లాపూర్ ప్రభుత్వ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మార్క్‌పోలోనియస్‌లు అవగాహన కల్పించారు. సైబర్‌క్రైంకు గురైతే టోల్‌ఫ్రీ నంబర్లు 1446, 1930కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయుష్ మెడికల్ ఆఫీసర్ కావ్యశ్రీ, ఎంఎస్ డబ్ల్యూ హెచ్‌ఓడీ వెంకటేశం, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటమ్మ, ఎస్‌వీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ తిరుపాల్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి



కల్వకుర్తి రూరల్: పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు భాషమోని ఆంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలోని గూడూరులో పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులందరికీ రుణమాఫీ, రైతుభరోసా ఇవ్వాలన్నారు. బాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జంగయ్య, కృష్ణయ్య, సాయిలు, నిరంజన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



తెలకపల్లి: ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నందిపేట భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కమ్మరెడ్డిపల్లిలో ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ప్రదేశాన్ని ఆయన సందర్శించి కూలీల సమస్యలు అడిగి లె లుసుకున్నారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు.

భీమ్ దీక్షా కరపత్రాలు విడుదల

లింగాల: మండల కేంద్రంలోని ఏకలవ్య చౌరస్తాలో మంగళవారం స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డపాకుల శివశంకర్ భీమ్ దీక్షా కరపత్రాలను విడుదల చేశారు. ఈ నెల 15న ఖమ్మం జిల్లా నెలకొండపల్లిలోని భీమ్ దీక్షను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ సంపత్ కుమార్, నాగర్‌కర్నూల్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ రాము, జగదాన్ని ఎర్రకిరణ్‌కుమార్, అశోక్, బాబు తదితరులు పాల్గొన్నారు.

భూనిర్వాసితుల నిరసన

బల్మూర్: ఏజెన్సీ ప్రాంతమైన బల్మూర్ గ్రామ సమీపంలో నిర్మించనున్న ఉమామహేశ్వర ప్రాజెక్టు పనులను రైతుల అనుమతులు లేకుండా నిర్మించడం చట్టవిరుద్ధమని రిజర్వాయర్ వ్యతిరేక కమిటీ అధ్యక్షుడు సీతారాంరెడ్డి మండిపడ్డారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం భూనిర్వాసిత రైతులు నిరసన చేపట్టారు. రైతులను సంప్రదించకుండా ఎమ్మెల్యే అధికారులతో కలిసి రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సరికాదన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శ్రీకాంత్, ఎస్ఐ రమాదేవిలకు అందజేశారు. రైతులకు సీపీఎం నాయకులు మద్దతు ప్రకటించారు. శంకర్‌నాయక్, రైతు సంఘం నాయకులు ఇంద్రారెడ్డి, రఘుమారెడ్డి, వెంకటస్వామి, నిర్వాసిత రైతులు పాల్గొన్నారు.

చెంచుయువత శ్రమదానం

అమ్రాబాద్: మండల కేంద్రమైన పదర మండల పరిషత్ కార్యాలయం, ప్రాథమిక పాఠశాల ఆవరణలో కోనేరు సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం చెంచు యువకులు శ్రమదానం చేశారు. యూత్ యాక్టివిటీలో భాగంగా పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించారు. కోనేరు సంస్థ ఏరియా కోర్డినేటర్ బాలకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

565 మందికి మధుమేహ పరీక్షలు

పాన్‌గల్: మండలంలో షుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు నిర్వహిస్తున్న మధుమేహ పరీక్షలు మండలంలో కొనసాగుతున్నట్లు పీహెచ్‌పీ డాక్టర్ చంద్రశేఖర్, సీహెచ్‌ఓ రామయ్య పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మాధరావుపల్లి, గన్యానాయక్‌తండాలో ఏఎన్‌ఎం సుమిత్ర పాల్గొని పరీక్షలు నిర్వహించారు. మండలంలోని 10 సబ్ సెంటర్ల పరిధిలో సిబ్బంది 565 మందికి పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కోడేరు: మండల కేంద్రంలోని ఆదర్శ మాడల్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ప్రవేశం కోసం దరఖాస్తులు ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాఘవేంద్ర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై అవగాహన

కల్వకుర్తి: ఎల్‌ఆర్‌ఎస్ పథకంపై పట్టణ ప్రజలకు అవగాహన కల్పించాలని కమిషనర్ మహమూద్ షేక్ కోరారు. మంగళవారం కార్యాలయంలో బిల్డర్లు, ఎల్‌టీపీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి తగిన సూచనలను అందించారు.

అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు ప్రారంభం



తాడూరు: మండలంలోని గోవిందాయ్‌పల్లిలో మంగళవారం అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, సీసీరోడ్ల నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు శేఖర్, జంగయ్య, చంద్రయ్యలు ప్రారంభించారు. ఎమ్మెల్యే రాజేష్ చొరవతో రూ.12 లక్షల నిధులు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ప్రధాన రోడ్డు వరకు అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు పూర్తయ్యాయని వివరించారు.

క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలి

తాడూరు: మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల సభ్యులు క్రమం తప్పకుండ ప్రతినెల సమావేశాలు నిర్వహించాలని ఐకేపీ ఏపీఎం బాల్‌చంద్రయ్య, సీసీ లక్ష్మణ్‌లు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని శివాలయ ఆవరణలో గ్రామ సంఘం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బుక్కుల నిర్వహణ, రుణాల చెల్లింపు అంశాలపై వారు అవగాహన కల్పించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

వెల్దండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదర్శ మోడల్ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 183 మంది విద్యార్థులకు నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఆదర్శ మోడల్ పాఠశాలల్లో 165 మంది విద్యార్థులకు 15 మంది విద్యార్థులు హాజరకాలేదు. ప్రిన్సిపల్ గోపాల్‌రావు, శ్రీధర్ ఉన్నారు.

మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ

వెల్దండ: మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటునట్లు ఏపీఓ ఈశ్వర్‌జీ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నారాయణపూర్, పల్గుతండాలో నర్సరీలను ఆయన పరిశీలించారు. నిర్వాహకులక పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట ఆయా గ్రామాల కార్యదర్శులు టీఏలు, మెట్లు పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల

కొల్లాపూర్: ఈనెల 15 నుంచి ఏప్రిల్ 14 వరకు చేపట్టనున్న పవిత్ర పరివర్తన జ్ఞాన దీక్షల పోస్టర్లను మంగళవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో అధికారి భన్సీలాల్ పోస్టర్లను విడుదల చేశారు. మోహన్‌కుమార్, కట్టా శ్రీనివాసులు, కలమంద శేఖర్ ఉన్నారు.

31 వరకు ఎల్‌ఆర్‌ఎస్ డబ్బులు చెల్లించాలి

ఉప్పునుంతల: తెలంగాణ ప్రభుత్వం ఈనెల ఈ నెల 31వ తేదీ వరకు ఎల్‌ఆర్‌ఎస్ డబ్బులు చెల్లించిన వారికి 25 శాతం రిబేట్ ఇస్తోందని ప్లాట్ల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీఓ నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఉప్పునుంతల, వెల్టూరు, రాయిచెడ్, అయ్యవారిపల్లి, మామిళ్లపల్లి, ఫిరట్వానిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వెంచర్లలో, లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు ఎల్ ఆర్‌ఎస్ డబ్బులు చెల్లించాలని కోరారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

లింగాల: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ వద్ద మంగళవారం పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఎంఈఓ బషీర్ అహ్మద్, అంబట్‌పల్లి కాంప్లెక్స్ హెచ్‌ఎం జ్యోతిరాణి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పురుషోత్తం, మండల శాఖ అధ్యక్షుడు వై.పాండుగౌడు, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ పాల్గొన్నారు.

కూలీలకు ఉపాధి కల్పించాలని వినతి

ఉప్పునుంతల: మండలంలోని మొల్గర, పెద్దాపూర్ సమీపంలోని దుందుబీ వాగు నుంచి అభివృద్ధి పనుల కోసం ఇసుక సేకరణలో కూలీలకు ఉపాధి కల్పించాలని బీజేపీ మండల అధ్యక్షుడు తోట్ల మహేష్ యాదవ్, పార్టీ నాయకులు మంగళవారం స్థానిక తహసీల్దార్‌ను ప్రమీలకు వినతిపత్రం అంజేశారు. వాగులో ట్రాక్టర్లకు ఇసుకను లోడింగ్ చేయడానికి యంత్రాలు వాడుతుండటంతో పరిసర గ్రామాల కూలీలు ఉపాధిలేక నష్టపోతున్నారని వివరించారు. శివకుమార్, సైదులు, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

పీఏసీఎస్ వైస్ చైర్మన్ కుటుంబానికి పరామర్శ

తిమ్మాజిపేట: మండలంలోని అప్పాజిపల్లిలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాందేవ్‌రెడ్డి తల్లి ఇటీవల మృతి చెందడంతో మంగళవారం నిర్వహించిన దశదిన కర్మకు మాజీ మంత్రి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. రాందేవ్‌రెడ్డిని పరామర్శించి ఓదార్చారు. మాజీ సర్పంచులు వేణుగోపాల్‌గౌడ్, మురళీధర్‌రెడ్డి, జడ్చర్ల నాయకులు నాగిరెడ్డి, కొడ్గల్ యాదయ్య తదితరులు ఉన్నారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు



పెద్దకొత్తపల్లి: మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా షీ టీం ఇన్‌చార్జ్ విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని ముష్టిపల్లి ఉన్నత పాఠశాలలో బాలికలకు షీ టీం భరోసాపై అవగాహన కల్పించారు. ఆకతాయిలు వేధిస్తే డయల్ 100కు లేదా 8712657676కు నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. హెచ్‌ఎం సురేఖ, షీ–టీం సభ్యులు వెంకటయ్య, జ్యోతి రాధికలు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల రిలే దీక్షలు

నాగర్‌కర్నూల్‌రూరల్: ఎస్సీ వర్గీకరణ చట్టం అమలు అయ్యే వరకు గ్రూప్–1,2,3 ఫలితాల చేయొద్దని కోరుతూ మంగళవారం జిల్లా కే ంద్రంలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు రిలే నిరహార దీక్షలను చేపట్టారు. ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ గూట విజయ్, విష్ణు, నాగరాజు, శేఖర్, నరేందర్ పాల్గొన్నారు.

నలుగురు కార్యదర్శులు బదిలీ

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాల్లో కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న నలుగురు కార్యదర్శులను జిల్లా అధికారులు మంగళవారం డిప్యూటేషన్‌పై ఇతర గ్రామాలకు బదిలీ చేసినట్లు ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని లింగారెడ్డిపల్లిలో కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న మహేష్‌గౌడ్‌ను బదిలీపై చారకొండ మండలం జూపల్లి గ్రామానికి బదిలీ చేశారు. లింగారెడ్డిపల్లి గ్రామానికి పోషమ్మగడ్డతండాలో పనిచేస్తున్న నవనీత, శంకరకొండతండా కార్యదర్శి హరితరాణి కల్వకుర్తి మండలం తోటపల్లి గ్రామానికి బదిలీ అయ్యారు. కల్వకుర్తి మండలం కుర్మిద్దలో పనిచేస్తున్న ఎల్లమ్మను శంకరకొండతండా కేటాయించారు. తిమ్మినోనిపల్లి గ్రామానికి చెందిన రాజేష్ వంగూర్ మండలం నిజామాబాద్‌కు, అక్కడ పనిచేస్తున్న అరుణ తిమ్మినోనిపల్లికి బదిలీ అయ్యారు. పోషమ్మగడ్డతండాకు చెందిన నవనీత లింగారెడ్డిపల్లికి, జూపల్లిలో పనిచేస్తున్న శ్రావణ్‌కుమార్‌ను పోషమ్మగడ్డతండాకు నియమించారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని కుమ్మెరలో 1992లో అప్పటి ప్రభుత్వం 150 మందికి ఇళ్ల స్థలాలు పట్టా సర్టిఫికేట్లను పంపిణీ చేసిందని ఇప్పటికి స్థలాలు చూపించలేదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జి అశోక్ పేర్కొన్నారు. మంగళవారం గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పట్టాలు అందుకున్న వారికి వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ర మేష్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

స్వగ్రామంలో అంత్యక్రియలు పూర్తి

కల్వకుర్తి రూరల్: మండలంలోని ముకురాలకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబం సోమవారం హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాలను మంగళవారం స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అశోక్ రెడ్డి తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. పట్టణంలో జాగృతి జిల్లా అధ్యక్షురాలు పావని కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు.

సమస్యలు పరిష్కరించాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 17వ వార్డు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 2వ రోజుకు చేరాయి. రమేష్, బాలు, వెంకటయ్య, రవి, నిరంజన్, తిరుపతయ్య, హేమలత, రామయ్య, అశోక్, శివవర్మ, తారాసింగ్ పాల్గొన్నారు.

పాడి రైతులు రాస్తారోకో

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని కోదాడ జడ్చర్ల జాతీయ రహదారి అయిన మహబూబ్‌నగర్ చౌరస్తాలో పాడి రైతులు మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు కిషోర్, జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి లు మాట్లాడారు. పాల ధరలు తగ్గించి రైతులకు ఇబ్బందులు కలిగించొద్దన్నారు. మార్కెటింగ్ చేయడంలో విజయ డెయిరీ విఫలం అయ్యిందన్నారు. నష్టాల పేరుతో పాల ధర తగ్గించాలనుకోవడం సరికాదన్నారు. మండలంతో పాటు వివిధ మండలాలకు చెందిన రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో రైతులు ఖాజా పాషా, వెంకట్ రెడ్డి, బక్కయ్య, శ్రీశైలం, మహేష్, కృష్ణయ్య గౌడ్, వెంకటయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలి

పెద్దకొత్తపల్లి: ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయించుకోవాలని ఎంఈఓ శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల విద్యావనరుల కేంద్రంలో ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని పరిశీలించారు. మరో 10 రోజుల పాటు ఆధార్ కార్డు అప్‌డేట్ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. సిబ్బంది శివలింగం, స్వామి పాల్గొన్నారు.

21 నుంచి 10వ తరగతి పరీక్షలు

ఈ నెల 21 నుంచి 10వ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేస్తునట్లు ఎంఈఓ తెలిపారు. మండలంలో 3 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఏ సెంటర్ జెడ్పీహెచ్‌ఎస్ పెద్దకొత్తపల్లి 200 మంది విద్యార్థులు, బీ సెంటర్ ప్రాథమిక పాఠశాలలో 172 మంది విద్యార్థులు, సీ సెంటర్ ఆల్‌సెంట్ మోడల్ స్కూల్‌లో 206 మంది విద్యార్థులు పరీక్షలు రాయనునట్లు తెలిపారు.



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి

బాధిత కుటుంబాలకు పరామర్శ

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన బిట్టి ఎల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఇటీవల జంగిలి ఈదమయ్య గుండెపోటుతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం చేశారు. రెండేళ్ల కిందట ఓ మహిళ మృతిచెందడంతో చిన్నారులు అనాథలయ్యారు. చిన్నారులను పరామర్శించి అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మాజీ ఎంపీటీసీ జ్యోతి, నిరంజన్, మాజీ ఉపసర్పంచ్ నిరంజన్, కుడుముల శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్, ఆనంద్, సతీష్, గణేష్, సుమన్, ప్రవీణ్, వెంకటయ్య, రవికుమార్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

చారకొండలో..

చారకొండ: మండలంలొని శేరి అప్పారెడ్డిపల్లి పడమటి తండాకు చెందిన కొర్ర రాజు అనారోగ్యంతో మృతి చెందాడు, విషయం తెలుసుకున్న సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్ రెడ్డి మంగళవారం తండాకు వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించాడు. అనంతరం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. వారి వెంట సీనియర్ నాయకులు మోతిలాల్, పర్వత్ రెడ్డి, యువజన నాయకులు శేఖర్, శ్రీనివాస్‌యాదవ్, తదితరులు ఉన్నారు.